క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శ్రీవారి దేవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వడవల్లి రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం శ్రీవారిని తులసిమాలలతో విశేష అలంకరణ నిర్వహించారు. శ్రీ సీతారామ చంద్ర, లక్ష్మణ, ఆంజనేయస్వామికి భద్రాచల కోదండ రామయ్య ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారిని ఆదిశేషమూర్తిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీవారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పింఛన్ల తనిఖీ చేపట్టిన వైద్యుల బృందం



అమరావతి: దీర్ఘకాలిక రోగుల పెన్షన్ల విచారణ మంగళవారం మండల పరిధిలో నిర్వహించారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్యుల బృందం తనిఖీ నిర్వహించింది. 16 సచివాలయాల పరిధిలో రూ.15 వేల పింఛను తీసుకుంటున్న 62 మందిని విచారించారు. ఇవి అత్తలూరు సచివాలయ పరిధిలో- 7, జూపూడి -1, ధరణికోట-1లో 11, ధరణికోట-2లో 6, అమరావతి-1లో 6, అమరావతి-2లో 6, లింగాపురంలో 3, నెమలి కల్లులో 5, ఉంగుటూరులో 2, కర్లపూడిలో 11, ఎంద్రాయిలో 3, వైకుంఠపురంలో ఒక పింఛనుదారు ఉన్నారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా తనిఖీలు నిర్వహించి, నివేదిక రూపొందించారు.

పింఛన్లను తనిఖీ చేసిన వైద్య బృందం

క్రోసూరు: మండలంలో మంచాన ఉన్న పింఛన్ లబ్ధిదారులను పరిశీలించేందుకు మంగళవారం సాయంత్రం డాక్టర్ల బృందం వచ్చినట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో 15 మంది లబ్ధిదారులను తొమ్మిది వైద్య బృందం పరిశీలించినట్లు పేర్కొన్నారు. దొడ్లేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సాద్ పాల్గొన్నట్లు వెల్లడించారు. ఎనిమిది గ్రామాల్లో తొలి రోజు మూడు గ్రామాలు సందర్శించినట్లు చెప్పారు. డాక్టర్ ఏబీసీ శ్రీనివాసరావు, డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ చార్లెస్ వెస్లీ, డాక్టర్ బి శ్రీరాం, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ భానుప్రకాశ్, డాక్టర్ రాంబాబు వైద్య బృందంలో ఉన్నట్లు తెలిపారు.

రేపు ఆత్మీయ సమావేశం

అమరావతి: పీడీఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోరుతూ గురువారం సాయంత్రం 4 గంటలకు స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రజా సంఘాల కన్వీనర్ బి.సూరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిస్వార్థపరుడిగా, ప్రజా సమస్యలపై శాసన మండలిలో గొంతెత్తి చాటిన విద్యావేత్త కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం ఈ సమావేశంలో జిల్లా ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటని పేర్కొన్నారు. సమావేశాన్ని జయప్రదం చేయాలని తెలిపారు.

రేపు ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక

సత్తెనపల్లి: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు ప్రజా వేదిక జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు సామాజిక తనిఖీ జరిగిన అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. 1,376 పనులకు గాను రూ.13,22,34,583 వేతనాలు, రూ.23,45,011 మెటీరియల్‌కు వెరశి రూ.13,45,79, 594 ఖర్చు చేయడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి 21 పనులకు మెటీరియల్ రూ.1,60,28,616 ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఉపాధి హామీ, పంచాయతీరాజ్ కలిపి 1,397 పనులకు వేతనాల రూపంలో రూ.13,22,34, 583, మెటీరియల్ నిమిత్తం రూ.1,83,73,627.. వెరశి రూ.15,06,08,210 ఖర్చు జరిగిందన్నారు.

పీహెచ్‌సీ మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు



క్రోసూరు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని క్రోసూరు పీహెచ్‌సీ మహిళా ఉద్యోగులకు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీలను వైద్యాధికారులు డాక్టర్ ధనుష్, డాక్టర్ సిరి చందన ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని పేర్కొన్నారు. శ్యాంసన్ మాట్లాడుతూ కబడ్డీ, క్రికెట్, తాడు లాగడం, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు వైద్యాధికారులు ఈ నెల 11న బహుమతుల ప్రదానం చేస్తారని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్భాటమే..బాట బాగుపడలేదు

- అధ్వానంగా ఉన్న ఆర్ అండ్ బీ రహదారులు
- గుంతలమయం.. తారు రోడ్లు
- మాటలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం
- ఆరంభ శూరత్వం..ఆచరణ శూన్యం 'పల్లె పండుగ'



రెడ్డిగూడెం-ఉప్పలపాడు వరకు ఉన్న ఆర్అండ్ బీ రోడ్డుపై గుంత



ధ్వంసమైన రాజుపాలెం- మొక్కపాడు తారు రోడ్డు

రాజుపాలెం: అన్నీ చేస్తామంటాం.. అన్నవన్నీ చేయం.. ప్రచార ఆర్భాటం.. ఆచరణ శూన్యం అన్నట్లు సాగుతోంది కూటమి ప్రభుత్వం. సంక్రాంతికి గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆర్భాట ప్రచారాలే కానీ, ఆచరణలో అది ఎక్కడా కానరావడం లేదు. 'పల్లె పండుగ' పేరుతో డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హడావుడి చేశారే కానీ, గ్రామీణ రహదారులను బాగు చేసిన దాఖలాలు లేవు. మండలంలోని ఆర్అండ్‌బీ రహదారులు, అంతర్గత రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఇంత వరకు ఒక్కరోడ్డుకు కూడా మరమ్మతులు చేపట్టలేదు. ఎక్కడి గుంతలు అక్కడే దర్శనమిస్తున్నాయి.

ఎక్కడిగొంగడి అక్కడే..

మండలంలో రెడ్డిగూడెం నుంచి ఉప్పలపాడు, గణపవరం నుంచి బీరవల్లిపాయ వరకు ఆర్అండ్‌బీ తారురోడ్లున్నాయి. ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.20లక్షలు మంజూరు అయినా.. అధికారులు మాత్రం పనులు చేపట్టకుండా నిమ్మకంగా ఉన్నారు. రాజుపాలెం, బ్రాహ్మణపల్లి నుంచి మొక్కపాడు వరకు తారు రోడ్డు అధ్వానంగా ఉన్న నిధులు మాత్రం మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు.

శంకుస్థాపనలకే పరిమితం

పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామాల్లోని సీసీ రోడ్లు సంక్రాంతి కల్లా ఉపాధి హామీ పథకం ద్వారా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 13 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు వేసేందుకు ఆర్భాటంగా శంకుస్థాపనలు చేశారు. దీనికి గాను రూ.1.47 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయి. కానీ ఇప్పటి వరకు నాలుగు గ్రామాల్లో మాత్రమే హడావుడిగా సీసీ రోడ్లు పూర్తి చేశారు. మిగిలి గ్రామాల్లో ఇంత వరకు పనులు ప్రారంభించలేదు.

మాటలకే పరిమితం



ఇది మాటల ప్రభుత్వం, చేతల ప్రభుత్వం కాదు. సంక్రాంతి కల్లా రోడ్లకు మరమ్మతులు చేపడతామని ఊదరగొట్టారు. ఇంత వరకు ఏ రోడ్డుకూ మరమ్మతులు చేపట్టలేదు. ఎక్కడి గుంతలు అక్కడే ఉన్నాయి. ఇప్పటికైన అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– రామావతు తులసీ నాయక్, మాజీ సర్పంచ్, ఉప్పలపాడు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో జి.శ్రీనివాస్

క్రోసూరు: ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీవో జి.శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అధికారులు తమ శాఖల ద్వారా జరుగుతున్న పనుల గురించి వివరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను నిర్మించేందుకు గ్రామాల కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవీలత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ పలు సర్వేలు జరుగుతున్నాయన్నారు. ఏవో వేణుగోపాల్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, వరికి పంటకు బీమా చేసుకునేందుకు ఈ నెల 15 వరకు గడువు పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

న్యాయవాద పరిరక్షణ చట్టాలు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: ప్రభుత్వాలు న్యాయవాద పరిరక్షణ చట్టాలను వెంటనే అమలు చేయాలని, పొన్నూరు పోలీసుల పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లోని న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయస్థానం ప్రాంగణంలోని న్యాయ దేవత వద్ద నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ పొన్నూరు పోలీసుల తీరుపై కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు విధులు బహిష్కరించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సయ్యద్ అబ్దుల్ రహీం, వి.పాపారావు, షేక్ జానీ ఖాజావలి, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, రాజశేఖరుని గోపాలకృష్ణమూర్తి, బి.అమర్ నాయక్, పాటిబండ్ల రవికుమార్, తవ్వా హరినాథ్, గంటా వెంకట శివ, కొల్లి శ్రీదేవి, యర్రసాని వెంకటేశ్వర్లు, కేదారి సాయిశ్రవణ్, తెనాలి నవజ్యోతిబాబు, పిట్టల సురేష్ బాబు పాల్గొన్నారు.

అభ్యుదయ విజ్ఞాన సమితి సేవలు అభినందనీయం



పండ్లు, రొట్టెల కిట్‌లు అందజేస్తున్న మాడా మల్లికార్జునరావు

సత్తెనపల్లి: అభ్యుదయ విజ్ఞాన సమితి సేవలు అభినందనీయమని సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు అన్నారు. అభ్యుదయ విజ్ఞాన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, సత్తెనపల్లి మాజీ సర్పంచ్ మాడా పుల్లారావు జయంతిని ఏరియా వైద్యశాలలో రోగులకు, బాలింతలకు పండ్లు, రొట్టెలతో కూడిన కిట్స్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు పేద రోగుకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడం వల్ల వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మాడా మల్లికార్జునరావు మాట్లాడుతూ సమాజ సేవలు చేయాలనే ఉద్దేశంతో తన తండ్రి పుల్లారావు అభ్యుదయ విజ్ఞాన సమితి పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించడం జరిగిందన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, గైనకాలజిస్ట్ డాక్టర్ బి.అరుణను సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, నాయకులు కొత్త లక్ష్మయ్య, భవిరిశెట్టి సుబ్రహ్మణ్యం, షేక్ సలాం, షేక్ జాకీర్, దూపగుంట్ల జానకి రామారావు, పిల్లుట్ల ఆంజనేయులు, తొమంద్రు సురేష్, సత్తెనపల్లి నాసరయ్య, కొత్తూరు విశ్వేశ్వర రావు, కుకుట్ల రామకోటేశ్వర రావు, కొత్త రామకృష్ణ, షేక్ మైసూర్, పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి ఎమ్మెల్యే వార్నింగ్..



సచివాలయ ఉద్యోగులకు హెచ్చరికలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: సచివాలయ ఉద్యోగులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని 28వ వార్డులోని సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ప్రజల దగ్గర నుంచి సిబ్బంది ఎవరైనా లంచం తీసుకుంటే ఉపేక్షించేది లేదన్నారు. విధులు నిర్వహించకుండా కార్యాలయాన్ని వదిలి బయటకు వెళ్తే సస్పెండ్ చేయిస్తానన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ, మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, కౌన్సిలర్ షేక్ మహ్మద్ గని, జాన్ బాబు ఉన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం..

ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసే వారిని నమ్మవద్దని, అలాంటివారు తారసపడితే ఫిర్యాదు చేయాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎయిర్ పోర్టులో, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు అక్రమార్కులు సామాన్యుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. తన పేరు, తన కార్యాలయ ఉద్యోగుల పేర్లతో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరు డబ్బులు వసూలు చేసినా తాట తీస్తామని హెచ్చరించారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు



నందిగామలో సూచనలిస్తున్న ఏఓ శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి: మొక్కజొన్న సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి అన్నారు. నందిగామ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మొక్కజొన్న పైరు ప్రస్తుతం 40-50 రోజుల దశలో ఉందని ఏఓ తెలిపారు. మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు నివారణ చర్యలు వివరించారు. మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

పెదకూరపాడు: మండలంలోని గారపాడు, హుస్సేన్ నగరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతులు రబీలో వేసిన పంటలకు ఈ - పంట నమోదునకు ఆయా రైతు సేవ కేంద్రాల్లోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించాలన్నారు. తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శాంతి తెలిపారు. కందిలో కాయ ఈగ నివారణ చర్యలు వివరించారు. ఉద్యాన సహాయకులు యశస్విని, రాజు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

కుందురువారిపాలెంలో

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): కుందురువారిపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని మొక్కజొన్న సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం పంటపై కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉందని, పురుగు కనిపించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే దిగుబడిపైన ప్రభావం చూపుతుందన్నారు. ఏఈఓ డేవిడ్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

వరిలో సిఫారసు మేరకే ఎరువులు

నకరికల్లు: వరినాట్లు వేసే రైతులు చదరపు మీటర్‌కు 44 కుదుళ్లు ఉండేలా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని నకరికల్లు, శివాపురంతండాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీసాగులో సిఫారసు చేసిన ఎరువుల మోతాదునే వాడాలన్నారు. పంట బీమాకు సకాలంలో ప్రీమియం చెల్లించాలని సూచించారు. వీఏఏలు షేక్.సుభాని, వై.ప్రభాకర్, జి.సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

మాదల విద్యార్థినుల ప్రతిభ



మాదల(ముప్పాళ్ళ): ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ జోనల్ మీట్‌లో మాదల పాఠశాల విద్యార్థినులు రన్నింగ్, క్యారమ్స్‌లో ప్రతిభ కనపరిచారు. ద్వితీయ, ప్రథమ స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపల్ జె.లక్ష్మీసునీత మంగళవారం తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో నెల్లూరు జిల్లా గొలగమూడి లో ఆటల పోటీలు జరిగాయి. మాదల పాఠశాలకు చెందిన వై.రామలక్ష్మి, కె.ప్రశాంతి, ఎ.హారిక, పి.అఖిల పరుగు పందెలో ద్వితీయ స్థానం, క్యారమ్స్‌లో ఎస్.నాగలక్ష్మి, పి.శ్రావణి పాల్గొని ప్రథమ స్థానం సాధించారన్నారు. విజేతలను పాఠశాల వైస్‌ప్రిన్సిపల్ ఎం.రాజారెడ్డి, పీఈటీ కె.ఎస్.నాగశశికళ, బోధన సిబ్బంది అభినందించారు.

కంది పంట క్షేత్ర సందర్శన



రాజుపాలెం: మండలంలోని అనుపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కంది పంటలో ఏడీఏ వి.హనుమంతరావు, మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య క్షేత్ర పర్యటను చేపట్టారు. ఏడీఏ రైతులతో మాట్లాడారు. కంది పంట పూత, కాయ దశలో ఉందని, మారుకా పచ్చల పురుగు ఉందని రైతులకు చూపించారు. ఈ పురుగు నివారణ మార్గాలను వారికి వివరించారు. వ్యవసాయ సహాయకులు డి.వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

ఫ్రైడే-డ్రైడే నిర్వహణతో వ్యాధుల నివారణ



రాజుపాలెం: ప్రతీ శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహించడం వల్ల గ్రామాల్లో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎంవో మాట్లాడారు. ప్రతి అనంతరం ల్యాబ్ టెక్నీషియన్ రికార్డులను, రిపోర్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవితేజ నాయక్, హెల్త్ సూపర్ వైజర్లు జీవన్ రావు, ఉషారాణి, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు



వెంకటపతిగనర్‌లోని ఎస్సీ కళాశాల వసతి గృహంలో సమస్యలు ఏకరవు పెడుతున్న విద్యార్థినులు

- ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో కనీస మౌలిక వసతులు కరువు
- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సంక్షేమ వసతి గృహాలు సందర్శన

సత్తెనపల్లి: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు చిట్టా విజయభాస్కరరెడ్డి అన్నారు. పట్టణంలోని నిర్మలనగర్‌లో ఉన్న బీసీ బాలుర వసతి గృహం, వెంకటపతి నగర్‌లోని ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాన్ని మంగళవారం వైఎస్సార్ సీపీ బృందం సందర్శించింది. అక్కడ నెలకొన్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాల బాలికలతో మాట్లాడారు. అనంతరం చిట్టా విజయ భాస్కర రెడ్డి మాట్లాడుతూ నెలా 15 రోజుల క్రితం ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాన్ని సందర్శించి, కనీసం మౌలిక వసతులు కల్పించాలని స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణకు, అధికారులకు విన్నవించినట్లు చెప్పారు. 50 రోజులు గడిచినా వసతి గృహంలో ఎలాంటి మార్పు లేదన్నారు. పాలు, గుడ్లు చూసిన దాఖలాలే లేవని విద్యార్థినులు చెబుతున్నారన్నారు. మెనూ పాటించడం లేదని మంగళవారం ఇడ్లీ, గుడ్డు, చట్నీ అందించాల్సి ఉంటే అన్నం పెట్టారని చెప్పారు. సోమవారం పులిహోర తయారు చేస్తే బాగా లేక అందరూ పడేశారని, అది గోడల వెనుక దుర్వాసన వస్తోందన్నారు. ఎముకలు కొరికే చలికి విద్యార్థినులు వణుకుతున్నప్పటికీ కనీసం కిటికీలకు మరమ్మతులు చేయించలేదన్నారు. కిటికీలు అద్దాలు పగిలిపోయి చున్నీలు అడ్డం కట్టుకొని చలిలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం దుప్పట్లు, బెడ్లు లేవని, వసతి సౌకర్యాలు కనుచూపుమేరా కనిపించడం లేదన్నారు. ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయన్నారు. బాలికల వసతి గృహంలో ఒక్కరోజు అధికారులు ఎవరైనా నిద్ర చేస్తే.. ఇక్కడి పరిస్థితులు అర్థమవుతాయన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి క్షేత్రస్థాయి పరిస్థితులపై విచారణ జరిపి, వసతి గృహాలకు మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాము కూడా తమవంతుగా విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతా మన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అచ్యుత శివప్రసాద్, లోకా మాధవ, తుమ్మల వెంకటేశ్వరరావు, వల్లెం.నరసింహారావు, మండదపు సాయి ఉన్నారు.

భూ సమస్యలపై సదస్సుల్లో అధిక అర్జీలు



దరఖాస్తు అందజేస్తున్న మహిళా రైతు

అచ్చంపేట: మండలంలోని పెదపాలెంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ప్రజల నుంచి 20 అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దారు జి.శ్రీనివాస యాదవ్ తెలిపారు. భూ సమస్యలు, ఆన్‌లైన్ నమోదు, సర్వే కొలతలకు వచ్చిన అర్జిలను సంబంధిత వీఆర్వో, సర్వేయర్లకు తక్షణ పరి ష్కారం కోసం పంపినట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెదకూరపాడులో రెవెన్యూ సదస్సు

పెదకూరపాడు: స్థానిక పంచాయితీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సును తహసీల్దారు మీసాల దానియేలు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. 38 మంది రైతులు రీ-సర్వేలో భూమి తగ్గిందని, సర్వే కొలతలు నిర్వహించాలని దరఖాస్తు చేసుకున్నారు. 4 అర్జీలు రెవెన్యూ సమస్యలపై వచ్చినట్లు తహసీల్దారు దానియేలు తెలిపారు. బుధవారంతో మండలంలో రెవెన్యూ సదస్సులు ముగుస్తాయని చెప్పారు. 90 శాతం సమస్యలను సదస్సులో పరిష్కరించినట్లు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, మాజీ ఎంపీపీ గల్లాబాబురావు, మాజీ ఎంపీటీసీ షేక్ ముంతాజ్ పాల్గొన్నారు.


అందుబాటులో ఓటర్ల జాబితా




సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భవానిశంకర్

ముప్పాళ్ళ: ఓటర్ల తుది జాబితా ఆయా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలత మంగళవారం సమావేశం నిర్వహించారు. జాబితాపై అభ్యంతరాలుంటే స్వీకరించాలన్నారు. 18 ఏళ్ల నిండిన వారిని గుర్తించి వారికి ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు అందించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీప్రసాదు పాల్గొన్నారు.

సమాచారం పొందుపరిచారు



పెదకూరపాడులోని పౌరసరఫ గోదాం వద్ద సమాచారం



కాలచక్ర రహదారిలో గుంతను పూడ్చిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

పెదకూరపాడు: ధరలు కనించవు.. సమాచారం ఉండదు అనే శీర్షికన ఈ నెల 6న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయా శాఖల సిబ్బంది స్పందించారు. పెదకూరపాడులోని పౌరసరఫరాల గోదాముల వద్ద సమాచార బోర్డులో నిల్వ, ధరల సమాచారం పొందుపరిచారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో నిల్వలు, ధరలను బోర్డుల్లో రాశారు. ఈ నెల 5న గుంత.. చింత అనే శీర్షికతో వచ్చి వార్తకు స్పందించిన పంచాయతీ సిబ్బంది గుంతను పూడ్చారు.

ఘనంగా దర్గా ఉరుసు మహోత్సవం



ప్రార్థనలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: పట్టణంలోని 28వ వార్డులో అజ్మీర్ దర్గా ఉరుసు(గంధం) మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ఉరుసు మహోత్సవానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. మత పెద్దలతో ప్రార్థనలో పాల్గొన్నారు.